# పాలతెలుపు నీలంకవరు



రావు దంచికొట్టేస్తున్నాడు — అంతా నోళ్ళు తెరుచుకుని వింటూన్నారు.

ఓఢ్ర దేశం అంతా ఆవనూనే వాడతారు. ఆవనూనె వేడి అయినా ఆ దేశానికి అది పడుతుంది.

మళయాళీలు కొబ్బరినూనె వంటినే పోసేసుకుంటారు. వారి ఆచార వ్యవహారాలు వేరు. ఆడవానికి తండ్రి ఆస్తి వెదుతుంది. మేనల్లుడికే రాజ్యం అన్నాడు.

ఆపైన కాఫీలు త్రాగారు అందరూ. రావు మాత్రం టీ తెమ్మన్నాడు. కాఫీ పైత్యం-ఆకలి చంపుతుంది. టీ ఆకలిని పుట్టిస్తుంది. హాట్ డ్రింక్స్ అంటే బ్రాందీ. విస్కీ వగైరాలు కూడా కాఫీ కన్న మంచివే. కాఫీ అంత భయంకరమైనది.

ఈసారి కాఫీలు త్రాగుతున్న వారంతా తెల్లబోయి చూశారు. సులోచన మరీ కంగారు పడింది. ఆమె రామకృష్ణరావు భార్య. చదువుకుంది. కోలముఖం. అందమైన కళ్ళు. పాల తెలుపు. నొక్కునొక్కులజుట్టు.ఆకర్షించేవంటిఛీరు. బ్రొకేడ్ జాకెట్టు తొడిగింది - టెరిలిన్ పెద్ద పువ్వుల నీలిరంగు చీర కట్టింది. మెళ్ళో గొలుసు. చేతులకు గాజులు. చాలా అందంగా వుంటుంది. ఆమె కంగారుపడింది. కాఫీ అంటే రావుగారికి ఇంత అయిష్టమా అని -

రామకృష్ణ నవ్వేసి - 'ఉప్మా ఎలా చేస్తారట' అన్నాడు ఉడికించడానికి. రావు సీరియస్‌గా తీసుకుని. నీటుగా ఆ విషయం అంతా చెప్పేడు. బొంబాయి రవ్వ. గోధుమ రవ్వ ఈ రెంటి తేడాలతోసహా. ఇతనికి నిజంగానే తెలుసు అనుకున్నారు. ఈగలు వాలాయి ఓ కప్పుమీద - 'ఇవి సంగీతం వినగలవు తెలుసా' అంటూ షెర్‌లాక్ హోమ్స్ అంతా చెప్పేసి. స్పానిష్ ఆర్మడా అంత పెద్ద నౌకాబలాన్ని అంతటినీ, ఇద్దరూ సాధారణ బ్రిటిష్ పౌరులు ఎలా గెలిచింది చూసినట్టు చెప్పేశాడు: డ్రేక్, హాకిన్స్. తనూకలిసిచేశారా అవని అన్నంత బాగా -

శివం, అచ్యుతరామయ్య. గురునాథం, రామకృష్ణ. సులోచన-అంతా వింటూన్నారు. నేను ఏరేసరి సిగరెట్ తీసుకుని కాల్చుకున్నాను. 'వెధవగోల ఎప్పుడూ ఉండేదే' అని . .

వాడు ఊరుకుంటేనా "జీసస్ చరిత్రలో పదేళ్ళకాలం అసలు చరిత్రకారులకే తెలియదు. ఆ కాలమంతా ఆయన మనదేశంలో బౌద్ధులతో కలిసి ప్రసంగించాడు. అందుకే జాతక కథలు ప్రాక్టికల్స్ ఓలాగే ఉంటాయ్" - అన్నాడు.

సులోచన విచిత్రంగా చూస్తోంది. తతిమావారు 'వీడెక్కడివాడురా! ఆబద్ధం' అన్నట్టు చూశారు.

గురునాథం బి. ఏ., బి. యల్. వకీలు. ఈ హోటలులోనే మకాం చేశాడు. మూడు రోజులుండి దగ్గర లోయలుచూసి పోదామని.

అట్లాగే అచ్యుత రామయ్యగారు గుంటూరులో ఎఫ్. సి. ఏ.. చాలా లీడింగ్ చార్టర్డ్ ఎకౌంటెంట్. సరదాగా వచ్చాడు ఒక్కడూ. శివం ఉన్నవాడు-ఏదో ట్రాక్టర్స్ వ్యాపార విషయంలో వచ్చాడు బిజినెస్‌మన్.

రామకృష్ణ డేవిడ్ అండ్ గోలియత్ కంపెనీలో సేల్స్ రిప్రజెంటేటివ్ - నెలకు ఐదారు వందలు వస్తాయి. ఎప్పుడూ తీరుబడే ఉండదు. ఓ వారం రోజులు శెలవు పెట్టి. ప్లెజర్ ట్రిప్‌గా వచ్చాడు భార్య సులోచనతోసహా. అంతా యీ హోటల్లోనే దిగడం కొంచెం యించుమించు అందరి ధ్యేయం వెకేషన్‌కోసం రావడమే కాబట్టి స్నేహితులయ్యారు. ఊరుచూడ్డం. కబుర్లాడుకోడం. కాలక్షేపం. అందుకనే ఒకటయ్యారు. పైగా ఈ మరాఠా దేశంలో తెలుగువాళ్ళు. యీ హోటల్లో దిగినవాళ్లు. వాళ్ళే కాబట్టి ఒకటి రెండు రోజుల్లోనే ఎక్కువ స్నేహంగా మసలారు. వారు దిగింది పూనాలోని చక్కటి హోటల్సులో ఒకటి.

ఇంకేంతా - రెండు మూడు రోజుల్లో ఎవరివూళ్ళకి వాళ్ళు వెళ్ళిపోతారు.

అప్పటిదాకా రమ్మీ ఆడుకున్నారు ఆ వేళమధ్యాహ్నం. ఆ తర్వాత నేనూ రావూ వెళ్ళగానే ఆట కట్టేసి రావుని మాట్లాడమన్నారు.

రావు ఇంటిపేరూ రావే. రావుకి ప్రపంచంలో ఉన్న అన్నీ తెలుసని నమ్మకం. అన్ని విషయాలు కూలంకషంగా మాట్లాడ

ఆదుర్తి వెంకట నరసింహమూర్తి

గలడు. చూస్తే పనిగట్టెయ్యగలడు: ఈ విషయం ఈ రెండురోజుల్లో వాళ్ళకి తెలిసి పోయింది.

సిగరెట్లు ఎలా తయారవుతాయి?

సినిమాలు ఎలా తీస్తారు?

బంట్రోతు ఉద్యోగంలో సాధక బాధకాలు.

బంజరు బయళ్ళు ఎలా సాగులోకి తీసుకు రావచ్చు - చెప్పాడు చాలాసేపు: మొదట పెళ్ళిళ్ళు ఎలా వుండేవి. సెక్సు. దాని మంచిచెడ్డలు. ఫ్రాయిడ్ -

డాస్టోవ్‌స్కీ గొప్పతనం.

అక్కడతో అవలేదు. సైకాలజీ, సైకియాట్రీ, ఇవేమిటి? సినిక్ ఎలా తయారవుతాడు. సమాజానిది ఎంతదాకా బాధ్యత. క్లెప్టోమానియా - అంటే సరదాకి దొంగతనం చేయడం. ఎలా అరికట్టవచ్చు. సైకో ఎనాలిసిస్. సైకో సినిమా - ఆస్కార్ వైల్డు. ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్. డంకన్. డగ్లస్. శ్రీశ్రీ గేయం. చలం సాహిత్యం మినప్పప్పు పచ్చడి. పచ్చ కర్పూరం వెంకటరమణమూర్తికి ఎంత ఖర్చవుతుంది? స్టేట్ ట్రాన్స్‌పోర్టు. ట్రాఫిక్ రూల్సు. ఆడపిల్లల పద్ధతి. హారిజాంటల్‌బార్. బందిపోటుల పద్ధతి. డిటెక్టివ్‌ల వేర్పు. అన్నీ చెప్పుకు పోతున్నాడు.

రామకృష్ణా సులోచనా దంపతులకు కూడా రావంటే ఇష్టం ఏర్పడింది. శివం. అచ్యుతరామయ్య. గురునాధం బలే ఇదయ్యారు.

ఆవకాయ పెట్టడందగ్గరనుంచి హైడ్రోజన్ బాంబుదాకా కూలంకషంగా తెలుసుకున్న రావు కబుర్లు ఉల్లాసం ఇచ్చాయి. అతనికి 'సర్వజ్ఞుడు' అని బిరుదు ప్రసాదించి. గులాబీపూల మెళ్ళో వేశారు.

ఈ సాయంత్రం మళ్ళీ అందరం అచ్యుతరామయ్యగారు తీసుకున్న హాలు గదిలో జేరాము. ఫేన్ తిరుగుతోంది. కూల్ డ్రింక్స్ త్రాగాము. అంతా ముస్తాబై ఉన్నాం. ఓ గంట రావుని విని ఏ సినిమాకన్నా పోదామనీ.

నీలంరంగు నైలాన్ చీరె. నీలంరంగు నైలాన్ జాకెట్టు. మెళ్ళో మాంచి మెరిసే నెక్లెస్. వీటితో ముస్తాబైంది సులోచన. సులోచన కళ్ళు మెరుస్తూఉంటాయి. సంతోషంవస్తే మరీనూ!

సర్వజ్ఞుడుకి ఇచ్చిన గ్రామఫోనులా మొదలెట్టాడు.

ఎన్‌సైక్లోపీడియా తెరిచినట్టే.

నెక్ లైన్-దాని పుట్టుక.

ఫ్రెంచిదేశపు బో.

అమెరికన్ అవుట్ ఫిట్టర్స్.

కాస్సేపు ఇవి మాట్లాడి తెలుగుదేశపు స్త్రీల ఆభరణాలలోకి దిగిపోయాడు.

పాపిడి పిందెలు.

జిగినీ గొలుసు.

దండకడియం.

పొంజేబు పట్టాలు.

అందెలు. కడియాలు.

వడ్డాణం. నాగరం. చామంతి పువ్వు. వీటి విలువలు - ఇవి ఆధునికంగా ఎలా రూపెత్తాయో. ఆ వివరాలూ!

శివం. అచ్యుతరామయ్య వాళ్లూ మురిసి పోతున్నారు.


రామకృష్ణ. బాగా వయస్సులోవాడు. బురుడీకొట్టించాలని సరదా!

'అలాగేం! అయితే యీ నెక్లెస్ ఖరీదెంతుంటుందీ?' అన్నాడు తన భార్య మెళ్ళో నెక్లెస్ చూపెట్టి -









విసుగ్గా మాట్లాడేస్తున్న రావు అంత వేగంలోనూ -

'దానికేం ఆరుకాసుల బంగారం-ఖరీదైన అసలు వజ్రాలు-తొమ్మిదివేల చిల్లర' అనేశాడు. అంటూ రామకృష్ణవంక, మావంక చూశాడు.

రామకృష్ణ పగలబడి నవ్వి 'అయింది సర్వజ్ఞుడి రంగు తేలింది' అన్నాడు.

'ఏం? ఏం? ఏం?' అన్నారు అంతా చాలా ఆదుర్దాగా!

నీలంరంగు దుస్తుల్లోని సులోచన కళ్ళప్పజెప్పి చూస్తోంది.

రావు మరోసిగరెట్టు టకాలున ముట్టించాడు -

రామకృష్ణ. నవ్వుతూనే 'మిష్టర్ రావ్! నేనేం జమీందారుని కాను -

రెక్కలాధారం - కనీసం ఈ రెండు రోజుల్లో మీ కావిషయం తెలుసు - అది తెలిసేనా మీరు ఆ నెక్లెస్ ఖరీదుకట్టవచ్చే-'

రావు వెంటనే-

'నోనో-నా లెఖ్ఖ తప్పదు కావాలంటే పందెంవేస్తాను- ఇంతకీ అదెంతంటారూ?'

రామకృష్ణ ఈసారి నవ్వకుండానే-

'నకిలీ బంగారం, గాజురాళ్ళ- మోజుపడి. మోడల్ బావుందని, మా ఆవిడ కొనుక్కుంది- ఐదు వందలు.'

రావు చాలా ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో-

'ఇంపాసిబుల్' అంటూ అరుస్తూ సులోచనవైపు తలతిప్పాడు. అప్పుడా అమ్మాయి రావువంక చూట్టంలేదు.

రామకృష్ణ ఇంకా హుషారుగా 'బెట్' అన్నాడు.

రావు తగ్గలేదు. 'ఓ యస్. పందెమే!' అన్నాడు.

రామకృష్ణ అట్టుడికిపోయినట్టు.

'కమాన్ ఎంత!'

'ఐదు వందలు !'

'మాట తప్పకూడదు'

'నాన్‌సెన్స్, నా మాటకు తిరుగుండ కూడదు'

రామకృష్ణ ఇంకా సీరియస్‌గా

"నకిలీదైతే మీరు నాకు ఐదువందలు ఇవ్వాలి.

నిజంగా మీరు కట్టిన ధరదైతే నేను ఇవ్వాలి. అంతేగా ?"

'అంతే !'

అప్పుడు రామకృష్ణ 'అయినా ఎందుకేనా మంచిది. వివరంగా చూసుకుని మరీ మాట్లాడండి' అంటూ సులోచన మెళ్లో నెక్లెస్ తియ్యబోయాడు-సులోచనే తీస్తోంది తల ప్రక్కకు తిప్పుకుని. రావు 'అఖ్ఖర్లేదు. అది షోరూమ్‌లో ఉంచేనే ఖరీదుకట్టగలనే. ఎదురుగా దానికి తియ్యాలా-వద్దు"అన్నాడు.

అంతా చాలా ఉబలాటంగా, ఉద్రేకంగా ఉన్నారు. నా కంగారు నాది. ఎక్కడి దిక్కుమాలినసంత అని.

బిబినెస్‌కోసం వచ్చిన శివం 'పదండి - అయితే - గోవర్ధనదాస్ అండ్ మురళీదాస్ జ్యూయలర్స్‌కి వెళ్ళదాం !'

పదండి అంటే పదండి అనుకున్నారు.

'నా కారులో అంతా పట్టాం' అన్నాడు అచ్యుతరామయ్యగారు -

ఆయన పెద్దమనిషి. 'ఈసరదాచూడాలి' అని ఉత్సాహం ! -

అంతా ముందు నడిచాం. సులోచన వెనకాల వస్తోంది.

స్టీరింగ్ వద్ద అచ్యుతరామయ్యగారు కూర్చున్నారు. ప్రక్క నేనూ, నా ప్రక్క రావూను. ఈ చివరగా వెనుకవరుసలో సులోచన, ఆమె ప్రక్క రామకృష్ణ, తర్వాత శివం, తర్వాత గురునాధం కూర్చున్నారు

నడిబజార్లో కారువెడుతోంది. ట్రాఫిక్ ఎక్కువగాఉన్నా కారు వేగంగానే వెడ్తోంది. అరుమైళ్ళుంది అక్కడికి గోవర్ధనదాస్-మురళీదాస్ కంపెనీ.

మధ్యమధ్య రామకృష్ణ-రావ్‌ని హెచ్చరిస్తూన్నాడు.

"నిష్కారణంగా ఐదువందలు - ఆలోచించుకోండి" అంటూ, అందుచేత రామకృష్ణతో మాట్లాడ్డంకోసమే రావు మధ్య మధ్య వెనక్కుతిరిగి రామకృష్ణ వైపుచూస్తూ

"లేదు బ్రదర్. మీరబద్ధం చెప్పారు. అది పదివేలే !" అని ఖచ్చితంగా అంటున్నాడు.

ఇంతసేపూ తల అవలివైపు త్రిప్పుకొని గ్లాస్ విండోలోంచి బయట జనాన్ని చూస్తున్న సులోచన ఈసారి చటుక్కున తల యిటుతిప్పి రావుని చూసింది.

అప్పుడు రావు ఆమెను చూశాడు.

ఆమె కన్నులల్లార్చి తల త్రిప్పేసుకుంది బయటి జనంవేపు.

కారు టర్నింగ్ తిరుగుతోంది.

ఇంక అవతల ఫర్లాంగు దూరంమఖపే ఆ జ్యూయలర్స్ కంపెనీ -

రావ్ ఏదోఆలోచిస్తున్నాడు. ఉన్నట్టుండి చటుక్కున పర్సుతీసి 'వెరీసారీ రామకృష్ణగారూ ! ఇంతదాకా తెస్తారు అనుకోలేదు. నేనే ఓడిపోయాను. ఇవిగో ఐదు వందలు" అంటూ ఐదు వంద రూపాయల నోట్లు వెనక సీట్లోకి అందిస్తున్నాడు. అచ్యుతరామయ్యగారు కారుక్రింద మనిషి పడిపోతే ఆపుచేస్తారే అలా ఆపేశారు. దిగ్భ్రాంతి చెందారు అంతా !

రామకృష్ణ, పగలబడినవ్వుతూ

'వాట్ ! ఏమైంది సర్వజ్ఞుడి పని - అయితే నకిలీవేనా !'

'ఓయస్ !'

'మరి కారువెనక్కుతిప్పేయమంటారా ?' అన్నాడు అచ్యుతరామయ్యగారు -

'ప్లీజ్. తప్పకుండా !' అన్నాడు రావు - పాపం ! సిగ్గుపడిపోతున్నాడు రావు అని అంతా గుర్తించారు - రామకృష్ణ డబ్బుఖర్లేదన్నాడు.

'ప్లీజ్ పందెం పందెమే !" అంటూ - ఆయన చేతుల్లో పెట్టేశాడు.

కారు మళ్ళీ హోటల్ పోర్టికోలోకొచ్చి ఆగింది - అంతా బిలబిలా నవ్వుతూ దిగేశారు. రావు వీపు న చరిచి అచ్యుతరామయ్యగారు.

'డోంట్ వరీ, మీరు చెప్పేవి నిజం అయినా కాపోయినా చాలా బాగా ఉంటాయ్' అన్నాడు. రావు అదోలా చూసి 'అ, ఎప్పుడూ నిజమే అవుతాయి టండి, అంటూ వచ్చేశాడు.

ఎవరి గదికి వారు వెళ్ళిపోయారు.

మా గదిలోకి మేము వచ్చాం. ఆపాద మస్తకం దహించుకుపోతోంది నాకు.

'ఒరి వెధవా ! నీ సర్వజ్ఞత తగులబడిపోనూ ! ఐదువందలు తగలేసుకున్నావ్ ! బుద్ధొచ్చిందా ? ఇప్పుడు కొంప ఎలా జేర్తావ్ ? మళ్ళీ ఆ ముసలానిడ రెండొందలు టి. ఎమ్. వో. పంపాల్సిందేనా ? ఒరేఒరే ఆ తల్లిని నానావిధాల ఏడిపిస్తున్నావురా ! ఇంకైనా "అన్నీ తెలుసు" అని గప్పాలు కొట్టకు" అని గద్దిపెట్టాను.

వాడు నవ్వుతూ పక్కమీద వాలి,

'నాకన్నీ తెలుసురా !' అన్నాడు ధీమాగా :

'ఛీ ! సిగ్గులేని వెధవా ! ఇంత జరిగినా నీ బుద్ధి నీకె !' అని ఆపెంకి ఘటంతో ఎందుకని - ఫ్లాస్క్‌లో కాఫీ త్రాగి పడుకున్నాను.

ఆరాత్రి పన్నెండు దాటింది. నాకేమిటో నిద్రపట్టలేదు. వాడు నిద్రపోయాడో లేదో నాకేం తెలుసు అంతరాత్రివేళ మా గది బయట - మాగది తలుపువద్ద అవతల వరండాలో అలికిడి అయింది.

లేచాను.

రావులేచి 'స్ ! అని సంజ్ఞగానే 'నాకన్నీ తెలుసురా' అన్న నటన చేసి చూపాడు. చంపేద్దామనుకున్నాను

ఇంతలోనే గది తలుపుకు, నేలకు మధ్యనున్న సందులోంచి ఒక నీలం కవరు లోపలకు వచ్చింది. మెల్లిగా వెళ్ళి ఆశ్చర్యంగా తీశాను 'ఏమిటా ?' అని. రావు నవ్వుతూ ఫ్లాస్కులో కాఫీ పోసుకుని త్రాగుతూ - దగ్గరగా వచ్చి 'వెధవా ! నాకన్నీ తెలుసురా !' అన్నాడు రహస్యంగా, గంభీరంగా.

కవరులో పది వంద రూపాయల నోట్లు ఒక ఉత్తరం ఉన్నాయి. పుత్తరంలో ఇలా ఉంది

"రావుగారికి,

మీకు అన్నీ తెలుసు.

మీరే పందెం గెలిచారు. నేను ఆ నెక్లెస్ పదివేలకే కొనుకున్నాను. మీకు సర్వదా కృతజ్ఞురాలిని"

(సోమర్ సెట్ మామ్ కథకు అనుసరణ)

□□□

